క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ


స్టడీ మెటీరియల్ అందించిన దృశ్యం

తనకల్లు: కోటపల్లి జెడ్పీ హైస్కూల్‌లో గురువారం 10వ తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ నాయకులు, సత్యన్నసేవా కొక్కంటి క్రాస్ టీం ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి గణేష్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో రూపొందించిన 10వ తరగతి స్టడీ మెటీరియల్ ఏటా అందిస్తున్నామన్నారు. మోడల్ పేపర్లు ఉచితంగా అందించిన సత్యన్న సేవ కొక్కంటి క్రాస్ టీంకు విద్యార్థులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. యూటీఎఫ్ నాయకుడు బాలక్రిష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీఏ క్యాలెండర్ విడుదల

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో గురువారం వైఎస్సార్‌టీఏ క్యాలెండర్‌ను ఎంఈఓలు మున్వర్ బాషా, ప్రసూన్ కుమార్ నాయుడు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కేశవరెడ్డి, శ్రీరాములు, విశ్వనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట లక్ష్మమ్మ, చెన్నకృష్ణారెడ్డి, నారాయణరెడ్డి, నిర్మలమ్మ, చెన్నారెడ్డి, రవీంద్రరెడ్డి, జయరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

ఓడీచెరువు: ఈనెల 11న విజయవాడలో తలపెట్టిన మహాధర్నా జయప్రదం చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గౌస్ లాజమ్ కోరారు. కొండకమర్లలో గురువారం మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి, సరెండర్ లీవులు, పీఎఫ్ రుణాలు, ఏపీజీఎల్ఐసీ రుణాలు, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల టైం స్కేల్ మంజూరు చేయాలని, ఎంటీఎస్ ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలన్నారు. డీటీఎఫ్ మండలాధ్యక్షుడు నరసింహులు, సోమశేఖర్ నాయక్, అతవుల్లా, సిద్దయ్య, చంద్రకళ పాల్గొన్నారు.

అమిత్‌షాను మంత్రి పదవి నుంచి తొలగించాలి

నల్లమాడ: పార్లమెంట్ సమావేశాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు పఠాన్ గౌస్‌బాషా డిమాండ్ చేశారు. గురువారం అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక పంచాయితీ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు రమణ, నారాయణ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వ్యక్తి మృతి


మృతుడు బిల్లే వన్నూరప్ప

బత్తలపల్లి: ధ్యాన తరగతులకు వెళ్తున్న ఓ వ్యక్తి రైల్వే స్టేషన్‌లో గుండెపోటుతో గురువారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం.. బత్తలపల్లికి చెందిన బిల్లే వన్నూరప్ప(73) కనిగిరిలో జరుగుతున్న ధ్యాన తరగతులకు వెళ్లేందుకు ధర్మవరం రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రైలు వస్తుందనే ఆత్రంలో మెట్లు ఎక్కి ఆయాసం పొందుతూ గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య బిల్లే నారాయణమ్మతో పాటు ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు.

జాబ్‌మేళా


ఉద్యోగాలు సాధించిన వారితో నాయకులు

ధర్మవరం: పట్టణంలోని సీఎన్‌బీ కళ్యాణ మండపంలో గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సంస్కృతి సేవా సంస్థ సౌజన్యంతో జాబ్‌మేళా నిర్వహించారు. ఈసందర్భంగా 99 కంపెనీల ప్రతినిధులు 5121 మంది నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 1668 మంది ఉద్యోగాలు పొందారని బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జ్ హరీష్‌బాబు తెలిపారు. ఈసందర్భంగా ఇంటర్వ్యూలు నిర్వహించిన వివిధ కంపెనీల హెచ్‌ఆర్‌లకు జ్ఞాపికలు అందించి అభినందించారు.


ఇటీవల వర్షాలకు తెగిపోయిన రాయలవారిపల్లి బ్రిడ్జి (ఫైల్)


శిథిలావస్థకు చేరుతున్న కోవెలగుట్టపల్లి బ్రిడ్జి

రాకపోకలు బందే!

దశాబ్దాల కిందటి వంతెనలవి. భారీ వర్షాలకు కోతకు గురయ్యాయి. రక్షణ గోడలు విరిగిపోయాయి. శిథిల దశకు చేరిన ఈ బ్రిడ్జిలపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిందే. బ్రిడ్జీలు కూలిపోతే రాకపోకలు నిలిచి.. జనజీవనం స్తంభించిపోతుంది.

- కూలడానికి సిద్ధంగా మూడు బ్రిడ్జీలు
- వర్షాలకు ఉధృతంగా నీటి ప్రవాహం
- దాటే క్రమంలో గల్లంతవుతున్న వారెందరో

పుట్టపర్తి అర్బన్: ఆ మూడు గ్రామాలు జిల్లా కేంద్రం పుట్టపర్తికి కూతవేటు దూరంలో ఉన్నాయి. వీరు పుట్టపర్తికి చేరాలంటే బ్రిడ్జి మీదుగా వెళ్లాలి. ఇప్పుడు ఆ బ్రిడ్జిలకు కాలం చెల్లింది. అప్పుడో ఇప్పుడో కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. పుట్టపర్తి నుంచి కిలో మీటరు దూరంలో గల రాయలవారిపల్లికి వెళ్లాలంటే చిత్రావతి బ్రిడ్జి ఒకటే మార్గం. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు బ్రిడ్జి తెగిపోయింది. వాహనాలు రాకపోకలు సాగించలేని పరిస్థితి. అప్పటి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి నది మధ్యలో పైపులు వేయించి మట్టి రోడ్డు ఏర్పాటు చేయించి రాకపోకలను పునరుద్ధరించారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు ఆ మట్టి రోడ్డు కూడా కోతకు గురవడంతో ప్రజలకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. ఇక పుట్టపర్తికి మరో సమీప గ్రామం కోవెలగుట్టపల్లి. జిల్లా కేంద్రానికి వెళ్లడానికి చిత్రావతి నదిపై నిర్మించిన బ్రిడ్జే ఆధారం. వరదలు వచ్చినపుడు ఈ బ్రిడ్జిపై నీరు ప్రవహిస్తూ ఉంటుంది. రోజుల తరబడి పారడం వల్ల పాచి పట్టి ఉంటుంది. దానిమీద వాహనాలు వెళ్లినపుడు, నడిచినపుడు జారుతుండడం పరిపాటిగా మారింది. అంతేకాదు గత ఏడాది ఒక రైతు ఇక్కడ కొట్టుకుపోయి మృతి చెందాడు. ఈ బ్రిడ్జికి కింది వైపు రక్షణగా ఏర్పాటు చేసిన గోడ పూర్తి శిథిలావస్థకు చేరింది. భారీగా నీళ్లు వచ్చిన సందర్భాల్లో బ్రిడ్జి దెబ్బతింటూ వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు.

ప్రాణాంతక ప్రయాణం

పుట్టపర్తి మండలం కొట్లపల్లి వద్ద ఉన్న మరో వంగపేరు బ్రిడ్జి రక్షణ గోడ ఛిద్రమైపోయింది. బ్రిడ్జి కింది భాగాన గండి పడి నీళ్లన్నీ వెళ్తున్నాయి. బ్రిడ్జి ఎప్పుడు కూలుతుందోనని ప్రజలు భయం భయంగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలకు రక్షణ గోడ లేకపోవడంతో ఇద్దరు కియా పరిశ్రమ ఉద్యోగులు ద్విచక్రవాహనంలో వస్తూ నీటి ఉధృతికి కొట్టుకుపోయి.. అతికష్టం మీద ప్రాణాలతో బయటపడ్డారు. ఈ బ్రిడ్జిల దుస్థితిని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పంట ఉత్పత్తులు తరలించలేకున్నాం



రాయలవారిపల్లి బ్రిడ్జి మీదుగా మా పొలాల్లోకి వెళ్లాల్సి ఉంది. బ్రిడ్జి కం కాజ్‌వే తెగిపోవడంతో పంట ఉత్పత్తులు తోలుకోలేకున్నాం. ఖరీఫ్‌లో చిత్రావతి ప్రవహించినప్పుడు అటువైపు వెళ్లలేకున్నాం. అధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి కం కాజ్‌వేను మరమ్మతు చేయాలి.

– గోపాల్‌రెడ్డి, ఎనుములపల్లి

కొట్లపల్లి బ్రిడ్జి మరమ్మతు చేయాలి



కొట్లపల్లి–నిడిమామిడి గ్రామాల మధ్య వంగపేరు నదిపై ఉన్న బ్రిడ్జి కం కాజ్‌వే ఎప్పుడైనా తెగిపోవచ్చు. ఇటీవల కురిసిన వర్షాలకు నది ప్రవహించినప్పుడు రైతులు, వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వచ్చే వర్షా కాలానికైనా బ్రిడ్జి మరమ్మత్తు పూర్తి చేయాలి.

– మాబుసాబ్, నిడిమామిడి

మున్సిపాలిటీకి సంబంధం లేదు



చిత్రావతిపై ఆర్డీటీ సంస్థ నిర్మించిన బ్రిడ్జి కం కాజ్‌వే మరమ్మతుకు మాకు ఎలాంటి సంబంధం లేదు. సంబంధిత కౌన్సిలర్ చెప్పినప్పుడు ప్రజలు దాటి వెళ్లడానికి మట్టి రోడ్డు వేయించారు. మరమ్మతులకు మున్సిపాలిటీలో నిధులు లేవు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పనులు చేయించవచ్చు.

– ప్రహ్లాద, కమిషనర్

డిగ్రీ కళాశాలలో న్యాక్ బృందం పర్యటన


కళాశాలలో పర్యటిస్తున్న న్యాక్ బృందం సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం న్యాక్ బృందం పర్యటించింది. న్యాక్ బృందం(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) చైర్మన్ డాక్టర్ జె.సదాశివభట్, కోఆర్డినేటర్ అనిల్ ఓజా, మెంబర్ బాబన్ తైవాడేకు కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఎన్‌సీసీ క్యాడెట్లు ఘన స్వాగతం పలికారు. గత ఐదేళ్లలోని కళాశాల అభివృద్ధి, విద్యా కార్యకలాపాలను న్యాక్ బృందం పరిశీలించింది. న్యాక్ ప్రమాణాలతో కళాశాలలో ఉన్న మౌలిక వసతులు, బోధన, పరిశోధన తదితర అంశాలతోపాటు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులతో వివరాలు తెలుసుకుంది. అనంతరం విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా న్యాక్ బృందం సభ్యులు మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తామన్నారు. విద్యార్థులు తమ లక్ష్యాల వైపు దృష్టి సారించి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. కళాశాల కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, అధ్యాపకులు పావని తదితరులు ఉన్నారు.

బాల్య వివాహాలు అరికడదాం


మాట్లాడుతున్న కమిషనర్ ప్రమోద్‌కుమార్

ధర్మవరం అర్బన్: సమష్టి కృషితో బాల్య వివాహాలు అరికడదామని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, సీడీపీఓ లక్ష్మి పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం కిశోరి వికాసం, భేటి భచావో.. భేటి పడావో కార్యక్రమంపై మండలస్థాయి శిక్షకుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బాల్య వివాహాలు, బాల కార్మికులు, బాల నేరస్థుల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కిశోరి వికాసం కార్యక్రమం చేపట్టిందని తెలిపారు. కిశోరి బాలబాలికల సర్వతోముఖాభివృద్ధి కోసం మండలస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు అరుణ, లత, మహిళా పోలీసులు, ఏఎన్ఎంలు, వార్డు సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఏర్పాట్లు


బత్తలపల్లిలోని లక్ష్మీవెంకటేశ్వర ఆలయాన్ని ముస్తాబు చేస్తున్న దృశ్యం

బత్తలపల్లి: వైకుంఠ ఏకాదశి వేడుకలకు ఆలయాలు ముస్తాబవుతున్నాయి. మండలంలోని పురాతన దంపెట్ల మధురాపురి చెన్నకేశవాలయం, ముష్టూరు శివాలయం, బత్తలపల్లి లక్ష్మీవెంకటేశ్వరాలయాలతో పాటు అన్ని గ్రామాల్లోని ఆలయాలను వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు చేశారు. వైకుంఠ ఏకాదశి రోజున ఆలయ ఉత్తర ద్వారం నుంచి ప్రవేశించి వేంకటేశ్వరుడిని దర్శించుకుంటే పాపహరణతో పాటు సకల సౌభాగ్యాలు కలుగుతాయని అర్చకులు తెలిపారు.

అమడగూరు: మండలంలో ప్రసిద్ధిగాంచిన తుమ్మల వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు శుక్రవారం వైకుంఠ ద్వార దర్శనాన్ని కల్పించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు చింతా శరత్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కొండపై ఎక్కలేని వారికి కూడా కొండ కిందనే వైకుంఠ ద్వారం గుండా వెంకటేశ్వరస్వామిని దర్శించుకునే ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే స్వామి దర్శనానికి వచ్చే భక్తులందరికీ అన్నదానం ఏర్పాటు చేసినట్లు వివరించారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడండి

కదిరి టౌన్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులను ఆదేశించారు. గురువారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లపై చర్చించారు. శ్రీవారిని దర్శనానికి పలు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తారని, వారికి ఇబ్బందులు కల్గకుండా ఏర్పాటు చేయాలన్నారు. ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ వెంకటసన్యాసి శర్మ, డీఎస్పీ శివనారాయణస్వామి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఆస్పత్రి సూపరెంటెండెంట్ డాక్టర్ హుస్సేన్, ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

కదిరిలో ట్రాఫిక్ ఆంక్షలు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా పట్టణంలో ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు. గురువారం రాత్రి 7 నుంచి శుక్రవారం సాయంత్రం సాయంత్రం 5 గంటల వరకు కదిర పట్టణ పరిసరాల ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. అనంతపురం, పులివెందుల, మదనపల్లి నుంచి హిందూపురం, బెంగళూరు వెళ్లే వారు కుటాగుళ్ల మీదుగా లేదా మదనపల్లి రోడ్డు, దేవరచెరువు, కొత్త బైపాసు మీదుగా వెళ్లాల్సి ఉంటుందన్నారు. వేమారెడ్డి సర్కిల్ నుంచి టవర్‌క్లాక్ వరకు పరిసర ప్రాంతాల ప్రజలు ఎలాంటి పరిస్థితుల్లో కార్లు, ఆటోలు, ద్విచక్రవాహనాల్లో హిందూపురం క్రాస్ నుంచి ఖాద్రీ ఆలయం వైపు వెళ్ల కూడదన్నారు. జీవిమాను సర్కిల్, మార్కెట్ నుంచి చౌక్ బజారు, శివాలయం వైపునకు వాహనాల రాకపోకలకు అనుమతులు లేవన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపిన వివరాలు.. వెస్ట్ బెంగాల్ రాష్ట్రం కూచ్ బేహార్ జిల్లా శింగిజాన్ గ్రామానికి చెందిన బిపుల్ బర్మన్(38) బేల్దారి పని నిమిత్తం పట్టణంలోని అంజుమన్ సర్కిల్ ఏరియాలో నివసిస్తున్నాడు. బుధవారం అర్ధరాత్రి బైక్‌పై పోతుకుంట రైల్వే ఓవర్ బ్రిడ్జిపైన వెళుతుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయాలు కావడంతో వాహనదారులు అతడిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తర్వాత అనంతపురం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అక్కడే మృతి చెందాడు. ఈమేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అట్రాసిటీ కేసు నమోదు

కదిరి అర్బన్: కులం పేరుతో దూషించిన దాడి చేసిన వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ నిరంజన్‌రెడ్డి గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు. గాండ్లపెంట మండలం ద్వారణాల గ్రామానికి చెందిన శేఖర్‌రెడ్డి కదిరి ఇండస్ట్రియల్ ఏరియాలో వడ్లు ఆడించుకునేందుకు వేమయ్య అనే వ్యక్తికి కూలీకి పిలుచుకెళ్లాడు. తనకు భోజనం సరిగా పెట్టలేదని వేమయ్య శేఖర్‌రెడ్డి తల్లికి ఫిర్యాదు చేశాడు. తన తల్లికే చెప్తావా అంటూ శేఖర్‌రెడ్డి వేమయ్యను కులం పేరుతో దూషించడంతోపాటు దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.


ముదిగుబ్బ పీవీఎస్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను జరుపుకుంటున్న దృశ్యం


కదిరి అర్బన్: హరీష్ పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


ఓడీచెరువు: విజ్ఞాన్ పాఠశాలలో చిన్నారుల సంక్రాంతి వేడుకలు

ముందస్తు సంక్రాంతి సంబరాలు

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లోని పలు ప్రైవేటు పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసుల వేషధారణలో ఆకట్టుకున్నారు. భోగమంటలు వేసి నృత్యం చేశారు. అందమైన రంగవల్లులు వేసి అందులో గొబ్బెమ్మలను ఉంచి పూజలు నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు.

సాక్షి, నెటవర్క్:



ధర్మవరం: సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న రూపారాజా పీసీఎంఆర్ విద్యార్థులు, పాఠశాల నిర్వాహకులు


ధర్మవరం అర్బన్: కాకతీయ పాఠశాలలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం


ఎన్‌పీకుంట: నాగార్జున పాఠశాలలో భోగిమంట వద్ద నృత్యం వేస్తున్న ఉపాధ్యాయినులు, విద్యార్థులు


బత్తలపల్లిజ్యోతి హైస్కూల్‌లో నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

మహిళకు తీవ్రగాయాలు

అమడగూరు: నిలువురాతిపల్లి సమీపంలో ఆటో నుంచి జారి పడి ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. కూలీలు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన హేమావతి రోజూ ఆటోలో మహమ్మదాబాద్ క్రాస్‌కు కూలీ పనులకు వెళ్లేది. గురువారం ఉదయం గ్రామానికి చెందిన కూలీలతో ఆటోలో క్రాస్‌కు బయలుదేరారు. అయితే గ్రామ సరిహద్దు దాటగానే అకస్మాత్తుగా హేమావతి ఆటో నుండి జారి కింద పడిపోయింది. ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయమై రక్తస్రావం ఎక్కువైంది. హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థులకు పద్యపోటీలు


విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఈ నెల 18న వేమన జయంత్యుత్సవాలను పురస్కరించుకుని కుమ్మరవాండ్లపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు వరదారెడ్డి గురువారం విద్యార్థులకు వేమన పద్య పోటీలు నిర్వహించారు. ఇందులో గెలుపొందిన విజేతలు లిఖిత, లుక్మాన్, వలీలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఆహారం అందించండి

పుట్టపర్తి టౌన్: అన్నా క్యాంటీన్ ద్వారా పేదలకు నాణ్యమైన ఆహారం అందించాలని కమిషనర్ ప్రహ్లాద నిర్వాహకులను ఆదేశించారు. గురువారం ఎనుములపల్లి వద్ద అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేశారు. క్యాంటీన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు.

డీఏ బకాయిలను ప్రకటించాలి

నల్లమాడ: పెండింగ్ డీఏ బకాయిలతో పాటు మరో డీఏను సంక్రాంతిలోపు ప్రకటించాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద గురువారం ఎస్టీయూ క్యాలెండర్లను ఎంఈఓ వేమనారాయణ ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా అదనపు కార్యదర్శి ఆసిఫ్ మాట్లాడుతూ 2003 డీఎస్సీ వారికి సెంట్రల్ మెమో నెం. 57 ప్రకారం పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలన్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆదినారాయణ, ప్రకాష్, ఉపాధ్యాయులు ఖలీల్ బాషా, అనిల్‌కుమార్ నాయక్, షాజాద్ బాషా, రామప్ప పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

ధర్మవరం అర్బన్ : అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ గురువారం తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు..పట్టణంలోని చేనేత మగ్గాల నిర్వాహకుడు ఆదిశేషుకు ఓ అమ్మవాయి ఫేస్‌బుక్‌లో పరిచయమైంది. అమ్మాయి అనంతపురంలో ఒకరికి ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింటే రూ.1.20లక్షలు ఇచ్చి మోసపోయానని చెప్పింది.తాను పోలీసునంటూ చెప్పి నీ డబ్బులు ఇప్పిస్తానంటూ నమ్మబలికి ధర్మవరానికి పిలిపించుకుని అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

కదిరి టౌన్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు బంగారు కృష్ణమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు గురువారం కదిరి ఆర్డీఓ ఆఫీసులో డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్‌కుమార్‌కు అందజేశారు. ఈసందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కర్ణాటక రాష్ట్రంలో వాల్మీకులు ఎస్టీలుగా ఉన్నారని, ఇక్కడ మాత్రం బీసీలుగా కొనసాగుతున్నారన్నారు. తమను ఎస్టీ జాబితాలో చేర్చకపోతే దశల వారీగా నిరసన కార్యక్రమాలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సేవా సంఘం నాయకులు గంగరాజు, నరసింహులు, అంజి, సురేష్, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

తలుపుల: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని వాల్మీకి సేవా సంఘం మండల సంఘం నాయకులు గురువారం తహసీల్దార్ రెడ్డిశేఖర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం రాయలసీమ గౌరవాధ్యక్షుడు చిన్ననరసింహులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

అమడగూరు: మండల వ్యాప్తంగా ఉన్న యువత సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ మునెప్ప పేర్కొన్నారు. 21 నుంచి 60 ఏళ్ల లోపున్న వారు ఈ సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. మూడు రకాల యూనిట్లను అర్హులైన వారికి ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారంతా ఈ నెల 16వ తేదీ లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాలు నివారించండి

కదిరి టౌన్: ప్రజలకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆర్టీఓకు సూచించారు. గురువారం ఆయన ఆర్టీఓ ఆఫీసును సందర్శించారు. కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఆర్టీఓ వరప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.